క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పిడుగురాళ్ల: పట్టణంలోని కొండమోడు మూడు సబ్ స్టేషన్ నుంచి సప్లై వచ్చే 11 కేవీ టౌన్ - 1 ,టౌన్ - 2 , ఎస్ఆర్ ఫీడర్ పరిధిలో మరమ్మతులు, నిర్వహణ పనుల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. విద్యుత్ శాఖ ఏఈ ఆరికట్ల శివనాగిరెడ్డి ఈ వివరాలు తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పలు చోట్ల విద్యుత్తు సరఫరా ఉంటుందని పేర్కొన్నారు.

గురజాల: పలు ప్రాంతాల్లో విద్యుతు సరఫరాకు ఆదివారం అంతరాయం కలగనుందని ఏడీఈ వీరేశ్వరరావు, ఏఈ మస్తాన్ వలిలు తెలిపారు. హైవేతోపాటు సబ్ స్టేషన్‌లో పనుల కారణంగా ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా కొన్ని ప్రాంతాల్లో నిలిపివేస్తున్నట్లు చెప్పారు.

పాఠశాలకు సామగ్రి వితరణ



పిడుగురాళ్ల రూరల్: చింతలపూడి వెంకటేశ్వర్లు వర్ధంతి సందర్భంగా బ్రాహ్మణపల్లి హైస్కూల్‌లో చింతలపూడి చారిటబుల్ ట్రస్ట్, పల్నాడు హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో సామగ్రి వితరణ కార్యక్రమం నిర్వహించారు. స్కూల్‌కు ఇంటర్ కమ్, మైక్ సెట్‌ను డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్ అందజేశారు. సర్పంచులు చల్లా శివారెడ్డి, విజయరామ రాజు, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి

మాచవరం: ప్రత్యేక అవసరాల చిన్నారులకు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలని హోం బేస్డ్ ఎడ్యుకేషన్ జిల్లా సహాయ సమన్వయాధికారి ఆర్. సెల్వ రాజ్ అన్నారు. మండలంలోని చెన్నాయిపాలెం , వేమవరం గ్రామాల్లో ప్రత్యేక అవసరాలు గల పిల్లలను, వారి తల్లిదండ్రులను ఆయన శనివారం కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వాల పరంగా ఇలాంటి పిల్లల కోసం సదుపాయాలు కల్పిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఎం.నాగేశ్వరరావు, కె. భార్గవి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సకాలంలో విత్తనాలు అందించాలి

పిడుగురాళ్ల రూరల్: సరైన సమయంలో తగిన విత్తనాలను రైతులకు అందించాలని జిల్లా వనరుల కేంద్రం డీడీఏ ఎం.శివకుమారి అన్నారు. మండలంలోని వీరాపురం, బ్రాహ్మణపల్లి గ్రామాల్లో జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో గ్రామ విత్తన పథకంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... విత్తనాన్ని కార్బనడిజం లేదా ట్రై సైక్లోజోల్‌తో శుద్ధి చేసుకుని నారుమడిలో విత్తుకోవాలని సూచించారు. 25 నుంచి 30 రోజుల నారుతో నాట్లు వేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ శాఖ అధికారి పి. ప్రవీణ్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మాచర్ల పట్టణంలో భారీ వర్షం

మాచర్ల: పట్టణంలో శనివారం ఉక్కపోతతో అల్లాడిన ప్రజలకు సాయంత్రం కురిసిన భారీవర్షంతో ఉపశమనం కలిగింది. ఐదు రోజులుగా ఎండలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో వాతావరణం చల్లబడి వర్షం కురడంతో కొంత సేద తీరినట్లయింది. ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం పడింది. పట్టణంలో రోడ్లు, డ్రెయినేజీ కాల్వలు వర్షం నీటితో పొంగి పొర్లాయి.

ఈ - క్రాప్ నమోదు వేగవంతం చేయాలి



రెంటచింతల: మండలంలో ఈ క్రాప్ బుకింగ్‌ను వేగవంతం చేయాలని మండల వ్యవసాయ అధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి అన్నారు. శనివారం బుకింగ్‌ను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... మండలంలో ఈ ఏడాది 24,872 ఎకరాలలో సాగుకుగాను ఇప్పటి వరకు పత్తి 1475, మిర్చి 618, వరి 3752, కంది 634 ఎకరాలలో వేశారని పేర్కొన్నారు. సుమారు 742 ఎకరాలలోని పంటల వివరాలను ఈ క్రాప్ బుకింగ్ పూర్తి చేసినట్లు చెప్పారు. వ్యవసాయ శాఖ సిబ్బంది, వీఆర్వోలు సంయుక్తంగా ఈ ప్రక్రియ చేపడుతున్నట్లు వివరించారు. దీని వల్ల రైతులకు ఎన్నో ప్రయోజనాలు ఉంటాయని తెలిపారు. ఏవో వెంట వీఏఏలు సతీష్, వెంకటేష్, రాంబాబు, రైతులు తదితరులున్నారు.

ప్రయోగ పథం.. గుర్తింపు ఘనం!

- ఇన్‌స్పైర్‌లో ప్రాజెక్టుల ప్రదర్శనకు ఆహ్వానం
- సెప్టెంబర్ 15వ తేదీ వరకు నమోదుకు గడువు
- వినూత్న ఆలోచనలతో సిద్ధమవుతున్న విద్యార్థులు



విద్యార్థులు తయారు చేస్తున్న ఓ ప్రాజెక్ట్



విద్యార్థులకు మెలకువలు నేర్పిస్తున్న ఉపాధ్యాయుడు

దాచేపల్లి: విద్యార్థుల మేధస్సుకు పదునుపెట్టే వేదిక అది.. సృజనాత్మక ఆలోచనలు పాఠశాల స్థాయి నుంచే వినూత్న ఆవిష్కరణలు సృష్టించేలా దారి చూపే పథమది... అదే 'ఇన్‌స్పైర్'. ప్రతిభ కనబరిస్తే గుర్తింపు ఘనంగా ఉంటుంది. ప్రోత్సాహం కూడా వెన్నుతడుతుంది. విద్యార్థుల చిట్టిబుర్రలో ఆలోచనలకు పదునుపెడితే అబ్బురపరిచేలా ప్రతిభను చూపించగలరని నిరూపించేలా గతంలో ఎన్నో ప్రాజెక్టులు రూపొందాయి. కేంద్ర ప్రభుత్వ శాస్త్ర, సాంకేతిక మంత్రిత్వశాఖ ప్రతి సంవత్సరం ఇన్‌స్పైర్ అవార్డ్స్ మనాక్ పోటీలను నిర్వహిస్తుంటుంది. నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్, రాష్ట్ర సాంకేతిక మండలి సహకారంతో పాఠశాల విద్యార్థుల కోసం ఈ సరికొత్త వేదికను రూపొందించారు. దీనిలో అన్ని ప్రభుత్వ అనుబంధ విద్యాసంస్థల్లో ఆరు నుంచి పదో తరగతి వరకు చదువుకుంటున్న విద్యార్థులు, వారికి పాఠాలు బోధించే ఉపాధ్యాయులతో కలిసి పాల్గొనే అవకాశం కల్పించారు. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి పోటీలకు ప్రాజెక్ట్‌లను ఆహ్వానిస్తున్నారు. తరగతికి ఒకరు చొప్పున పాఠశాలకు ఐదు ప్రాజెక్ట్‌లు నమోదు చేసుకునే అవకాశం కల్పించారు. 2008–09 నుంచి పోటీలు నిర్వహిస్తున్నారు.

ఎన్నో అవకాశాలు...

వెబ్‌సైట్‌లో ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేసుకున్న పాఠశాల లాగిన్ ద్వారా సెప్టెంబర్ 15 తేదీలోపు విద్యార్థులు వారి ఆలోచనలకు అనుగుణంగా రూపొందిన ప్రాజెక్ట్ వివరాలను నమోదు చేసుకోవాలి. అవార్డుకు ఎంపికైన ప్రతి విద్యార్థికి జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రాజెక్ట్ ప్రదర్శించేందుకు వీలుగా రూ.10 వేల పారితోషికం అందిస్తారు. తర్వాత రాష్ట్ర స్థాయిలో సత్తా చాటి జాతీయ ప్రదర్శనకు ఎంపికైతే రూ.25 వేల వరకు ప్రాజెక్టు మెరుగు పర్చుకునేందుకు నిధులు కేటాయిస్తారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు రాష్ట్రపతి భవన్, జపాన్ సందర్శన అవకాశాలతోపాటుగా ఇంజినీరింగ్ కళాశాల విద్యలో మెరుగైన అవకాశాలను కల్పిస్తారు. జాతీయస్థాయికి ఎంపికైన ప్రాజెక్ట్‌కు పేటెంట్ లభించే అవకాశం కూడా ఉంది.

దరఖాస్తు చేసుకునే విధానమిదీ..

తొలుత పాఠశాల స్థాయిలో ఐడియా కాంపిటీషన్ నిర్వహించాలి. స్థానిక సమస్యను పరిష్కరించేలా ఆ ఆలోచన ఉండాలి. తరగతులవారీగా ఉత్తమ ఆలోచనను ఎంపిక చేసి, అవసరమైన ప్రాజెక్ట్‌ని రూపొందించాలి. విద్యార్థి పేరు, తండ్రి పేరు, తరగతి వివరాలు నమోదు చేయాలి, విద్యార్థికి సంబంధించిన బ్యాంక్ ఖాతా నంబర్, ఆధార్ వివరాలు ఇవ్వాలి. ప్రాజెక్ట్ గురించి సంక్షిప్తంగా రాత పూర్వకంగా పొందుపర్చి సంబంధిత రైటప్ వెబ్‌సైట్‌లో నమోదు చేయాలి. ప్రాజెక్ట్ పేరు, శాస్త్ర సాంకేతికతకు సంబంధించిన అంశాలు ఉండేలా చూసుకోవాలి. ప్రాజెక్ట్ ఎంపికను రెండు నెలల్లో పూర్తి చేసి జిల్లాస్థాయిలో ప్రకటిస్తారు. తర్వాత వాటిని రాష్ట్రస్థాయికి పంపిస్తారు. ఎంపికైన ప్రాజెక్ట్‌కు ప్రయోగ నిమిత్తం బ్యాంక్ ఖాతాలో రూ.10 వేలు జమ చేస్తారు. దరఖాస్తు చేసుకోవడానికి సెప్టెంబర్ 15వ తేదీ వరకు గడువు ఉంది.

ప్రాజెక్ట్‌లు రూపొందిస్తున్నాం



శాస్త్ర, సాంకేతిక రంగంలో దేశం, ప్రపంచం దూసుకుపోతోంది. అందుకు తగినట్లుగానే మా చదువులు కూడా ఉండాలి. విద్యతోపాటు ఆ దిశగా మాకు ఆలోచనలు వస్తున్నాయి. ఇన్‌స్పైర్ కార్యక్రమం దీనికి ఎంతగానో దోహదపడుతుంది. మాలో ఉన్న సృజనాత్మక ఆలోచనలకు వేదికగా ఉంది. పాఠశాలలో మా ఆలోచనలకు తగినట్లుగా ఉపాధ్యాయుల సహకారంతో మంచి ప్రాజెక్ట్‌లను తయారు చేస్తున్నాం. మంచి గుర్తింపు వస్తుందని ఆశిస్తున్నాం.

– షేక్ సమీరాబేగం, విద్యార్థిని, దాచేపల్లి

విద్యార్థులకు సహకారం



పోటీల కోసం విద్యార్థులతో ప్రాజెక్ట్‌లను తయారు చేయిస్తున్నాం. ఇప్పటికే విద్యార్థుల ఐడియాలను తెలుసుకుని వారి ఆలోచనలకు తగినట్లుగా అద్భుతమైన ప్రాజెక్ట్‌లను సిద్ధం చేస్తున్నాం. విద్యార్థులకు ఈ పోటీ మంచి భవిష్యత్ అందిస్తుంది. వారిలోని సృజనాత్మక ఆలోచనలు వెలికి తీసేందుకు ఇదొక గొప్ప అవకాశం.

– రాజమోహన్, సైన్స్ ఉపాధ్యాయుడు, దాచేపల్లి

ప్రతి పాఠశాల పాల్గొనేలా చర్యలు



ప్రతి ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల నుంచి ఇన్‌స్పైర్‌లో ప్రాజెక్ట్ ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే సైన్స్ ఉపాధ్యాయులకు శిక్షణ కూడా ఇచ్చాం. విద్యార్థులతో కలిసి ఐడియాలజీ తరగతులు కూడా పెట్టాం. హైస్కూల్స్, ఆదర్శ పాఠశాలలు, కేజీబీవీల నుంచి ఐదేసి చొప్పున ప్రాజెక్టులు, ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలల నుంచి మూడు వంతున ఇన్‌స్పైర్‌లో నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. విద్యార్థులకు ఈ కార్యక్రమం మంచి భవిష్యత్‌ను ఇస్తుంది.

– కూరగంటి కాంతారావు, ఎంఈవో, దాచేపల్లి

గిరిజన మహిళపై దాడి సమంజసమా?

మాచర్ల: స్వాతంత్ర్య దిన వేడుకలలో జెండాను ఆవిష్కరించకుండా ఓ ఎస్టీ మహిళా నేతను అడ్డుకోవటం అత్యంత దారుణమని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్టీ విభాగ అధ్యక్షులు మేరాజోతు హనుమంతునాయక్ అన్నారు. శనివారం ఆయన మాచర్లలో విలేకర్లతో మాట్లాడుతూ.. కారంపూడి పంచాయతీ కార్యాలయంలో జెండాను ఆవిష్కరించటానికి వెన్నెల బాయి వెళితే ఎస్టీ అనే భావనతో పలువురు అడ్డుకోవటం అత్యంత దారుణమన్నారు. ఆమె కుటుంబసభ్యులను వేధించి, దాడి చేసి మరీ సర్పంచి పదవికి రాజీనామా చేయాలని బెదిరించారని ఆరోపించారు. ఇంత జరిగినా వారు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లటానికి కూడా భయపడే పరిస్థితి అధికార పార్టీ నాయకుల వల్ల నెలకొందన్నారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను టార్గెట్ చేసి ఇలా వేధిస్తున్నట్లు ఆరోపించారు. వారు ప్రజాప్రతినిధులుగా కొనసాగడం ఇష్టం లేని టీడీపీ నాయకులు దాడి చేయటం మంచి పద్ధతి కాదన్నారు. అధికారంలోకి రావటానికి అన్ని వర్గాల మద్దతు కావాలని అడిగి.. ఈ రోజు ఇంత దుర్మార్గంగా గిరిజన మహిళను అడ్డగించటం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. తీరు మారకుంటే రాష్ట్రవ్యాప్తంగా గిరిజనులను కూడగట్టి అధికార పార్టీ తీరుపై ఉద్యమం చేస్తామని ఆయన హెచ్చరించారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

రెంటచింతల: స్థానిక శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలోని శ్రీ వాసవి మాతకు ఆర్యవైశ్య మహిళ మండలి సభ్యులు శుక్రవారం రాత్రి పుట్టింటి సారె సమర్పించారు. భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు శ్రేష్టి శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. దేవస్థానం చైర్మన్ కట్టమూరి వెంకట నాగేశ్వరరావు, కార్యదర్శి నాళం చినబాబు, కోశాధికారి దేవరశెట్టి వెంకట నరసయ్య, కమిటీ సభ్యులు నాళం పెదబాబు, కట్టమూరి గణేష్‌బాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పురపాలక సంఘం అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి



టౌన్ ప్లానింగ్ అధికారికి రాజీనామా పత్రాన్ని అందిస్తున్న చిన్న ఏసోబు

మాచర్ల: పట్టణంలోని ప్రతి వార్డును అభివృద్ధి చేస్తామని, సమస్యలు పరిష్కరిస్తామని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. శనివారం పురపాలక సంఘ కార్యాలయంలో కౌన్సిల్ అత్యవసర సమావేశం చైర్మన్ మాచర్ల చిన్న ఏసోబు అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తొలుత తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని చెప్పారు. నీటి సరఫరాకు సంబంధించి వాటర్ ప్లాంట్ విస్తీర్ణం పెంచటంతోపాటు బుగ్గవాగు రిజర్వాయర్ నుంచి కూడా నీటి సరఫరాకు ప్రతిపాదనలు ఉన్నాయని తెలిపారు.

అజెండాకు సంబంధించి మంచినీటి సమస్య పరిష్కారం, ఫిల్టర్‌బెడ్‌ల రిపేరు, ట్రాఫిక్ నియంత్రణ, డ్రైనేజీ ఇబ్బందులు తీర్చడానికి చర్యలు తీసుకోనున్నట్లు వెల్లడించారు. పురపాలక సంఘానికి సంబంధించిన స్థలాలకు హద్దులు వేసి, రక్షించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ నిధులు తీసుకొచ్చి పురపాలక సంఘ అభివృద్ధికి పార్టీలకతీతంగా కృషి చేస్తామని చెప్పారు. అంతకుముందు ఆయన వైఎస్సార్ సీపీ నుంచి టీడీపీలో చేరి మద్దతు ఇస్తామని చెప్పిన మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన్న ఏసోబు, వైస్ చైర్మన్ పోలూరి నరసింహారావులతోపాటు పలువురితో చర్చించారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు షేక్ మదార్ సాహెబ్, గట్ల అరుణ, ఎంఆర్ఎఫ్ రామాంజిరెడ్డి, విజయ, సుభాని, ఎం.శ్రీనివాసరావు, బత్తిన వేణు, తేరాల సిద్ధమ్మ, షేక్ దస్తగిరి, చందుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పురపాలక సంఘం చైర్మన్ రాజీనామా

మాచర్ల పురపాలక సంఘ చైర్మన్ మాచర్ల చిన్న ఏసోబు శనివారం సాయంత్రం తన పదవికి రాజీనామా చేశారు. మూడు రోజుల క్రితమే మాచర్ల టీడీపీ ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డిని కలిసి రాజీనామా విషయం తెలిపారు. శనివారం పురపాలక సంఘ అత్యవసర సమావేశంలో ఎమ్మెల్యేతో ఆయన మాట్లాడారు. అనంతరం మున్సిపల్ వైస్ చైర్మన్ పి.నరసింహారావు, ఒకటో వార్డు కౌన్సిలర్ అరుణ కోటిరెడ్డితోపాటు వెళ్లి టౌన్ ప్లానింగ్ అధికారి నాగేశ్వరరావుకు రాజీనామా పత్రాన్ని అందజేశారు. వైఎస్సార్ సీపీ నుంచి కౌన్సిలర్లుగా ఎన్నికైన 16 మంది టీడీపీలో చేరారు. ఇన్‌చార్జి మున్సిపల్ చైర్మన్‌గా వైస్ చైర్మన్ పి.నరసింహారావు బాధ్యతలు స్వీకరించనున్నట్లు అధికారులు తెలిపారు.

చిట్టి చిన్నారులపైనా చిన్నచూపేనా?

- వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో సకాలంలో పుస్తకాలు అందజేత
- కూటమి సర్కారు వచ్చాక అంగన్‌వాడీల్లో చదువులకు ఆటంకం



కిట్ల ద్వారా చదువుకుంటున్న దృశ్యం



చిన్నారులకు పుస్తకంలో బొమ్మల ద్వారా పాఠాలు నేర్పుతున్న సిబ్బంది

గురజాల: బాల్య దశలో విజ్ఞానం పెంపొందించడంతోపాటు ఆంగ్ల మాధ్యమంపై పట్టు సాధించేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అంగన్‌వాడీ కేంద్రాల్లో వీరికి ఆటపాటలతో కూడిన బొమ్మల పుస్తకాలను ఇచ్చింది. కేంద్రాలకు వచ్చే మూడు నుంచి ఆరేళ్ల లోపు చిన్నారులకు ఆంగ్లబోధన అందించాలనే ఉద్దేశంతో నాలుగు పుస్తకాలతో కూడిన పీపీ–1, పీపీ–2 కిట్లు అందించింది. ప్రభుత్వ పాఠశాలల తరహాలో ఆంగ్ల బోధన అంగన్‌వాడీ కేంద్రాల్లో అందడంతో పిల్లలను తల్లిదండ్రులు ఇక్కడికి పంపించేవారు. పిల్లల సంఖ్య గణనీయంగా పెరిగింది.

పాత పుస్తకాలే దిక్కు

ప్రస్తుతం పీపీ–1, పీపీ–2 కిట్లు అందకపోవడంతో పిల్లలకు పాత పుస్తకాలతోనే బోధిస్తున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమై మూడు నెలలు కావస్తున్నా పుస్తకాలు అందలేదు. ఇప్పటికే చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పించారు. అంగన్‌వాడీలలో చిన్నారుల సంఖ్య గణనీయంగా తగ్గింది. ఈ తరుణంలో వారికి అవసరమైన వసతులు కల్పించేలా చర్యలు మాత్రం తీసుకోవడం లేదు. పీపీ–1, పీపీ–2 కిట్లలో పిల్లలకు ఎంతగానో ఉపయోగపడే పాఠ్యాంశాలు ఉన్నాయి.

18 వేల మందికిపైగా చిన్నారులు

గురజాల నియోజకవర్గంలోని గురజాల ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో గురజాల, దాచేపల్లి, పిడుగురాళ్ల ప్రాజెక్టు కింద పిడుగురాళ్ల, మాచవరం మండలాలు ఉన్నాయి. మండలాల వారీగా చూస్తే గురజాలలోని 2 క్లస్టర్లకుగాను 56, దాచేపల్లిలోని 3 క్లస్టర్లకుగాను 76, మాచవరంలోని 3 క్లస్టర్లకుగాను 63, పిడుగురాళ్లలోని 4 క్లస్టర్లకుగాను 120 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. నాలుగు మండలాల్లో మొత్తం 18,734 మంది చిన్నారులు ఈ కేంద్రాల్లో విద్యనభ్యసిస్తున్నారు.

వైద్య సిబ్బంది నిరసన



మాచర్లలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు

మాచర్ల: కోల్‌కత్తాలో వైద్యురాలిపై జరిగిన దారుణాన్ని నిరసిస్తూ పలుచోట్ల వైద్యులు నిరసన ర్యాలీలు నిర్వహించారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వైద్య సిబ్బందికి రక్షణ కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన చట్టాలు తేవాలని డిమాండ్ చేశారు. పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ ఉదయభాను, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (డాక్టర్స్) నియోజకవర్గ అధ్యక్షులు కె.రామకోటయ్య ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైద్యశాల నుంచి ర్యాలీని ప్రారంభించి తహసీల్దార్ కార్యాలయం వరకు నిర్వహించారు. అనంతరం అర్బన్ సీఐ కె.ప్రభాకర్‌కు వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో కేపీ చారి, ప్రభుత్వ వైద్యశాల వైద్యులు దినేష్, వంశీ, సురేష్, జయప్రకాష్, రేవంత్, లావణ్య, మురళి తదితరులు పాల్గొన్నారు. ప్రైవేటు వైద్యశాలలకు సంబంధించి డాక్టర్ రామకోటయ్య ఆధ్వర్యంలో మురళీకృష్ణ, మోహనరావు, రామకృష్ణారెడ్డి, రాజశేఖరరెడ్డి, రామమూర్తి, చిన్న డాక్టర్‌తోపాటు పలువురు నిరసన తెలిపారు.

రెంటచింతల: స్థానిక పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ నర్రా కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో శనివారం పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది, ఆరోగ్య ,ఆశా కార్యకర్తలు నిరసన ర్యాలీ నిర్వహించారు. పీహెచ్‌సీ నుంచి రెంటచింతల గ్రామ పురవీధులలో ఇది కొనసాగింది. ఆటో స్టాండ్ సెంటర్లో మానవహారంగా ఏర్పడ్డారు. డాక్టర్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. దేశంలో మహిళలపై అత్యాచారాలు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చట్టాలను సవరించి ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా చూడాలని కోరారు. వైద్యులు వి. ప్రదీప్ కుమార్‌రెడ్డి, రమాదేవి, హేమ, సూపర్ వైజర్స్ ఎస్. కోటేశ్వరరావు, ఎ. ఆంజనేయులు, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

పిడుగురాళ్ల: ఫిజియోథెరపీ వైద్య సేవలను శనివారం బంద్ చేశారు. ఈ సందర్భంగా సంబంధిత సంఘం అధ్యక్షులు క్రాంతికుమార్ మాట్లాడుతూ... కోల్‌కత్తా వైద్యురాలి కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



రెంటచింతలలో..

దాచేపల్లి: దాచేపల్లిలోని వైద్యులు, సిబ్బంది నల్ల రిబ్బన్లు ధరించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు ఇమ్మిడిశెట్టి అమూల్య, మధు, కనుమూరి విక్రాంత్, శ్రీరామనేని కృష్ణప్రసాద్, కర్నాటి వరలక్ష్మి, సాయికర్ణ తదితరులు పాల్గొన్నారు.

గురజాల: వైద్యుడు పార్దు ఆధ్వర్యంలో శనివారం ఉదయం సామాజిక ఆరోగ్య కేంద్రం నుంచి బ్రహ్మనాయుడు విగ్రహం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. మానవహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది తదితరులున్నారు.

పిడుగురాళ్ల: పట్టణంలోని ఆసుపత్రుల్లో సాధారణ వైద్య సేవలను నిలిపివేశారు. ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ దూళ్లిపాళ్ల భరత్‌కుమార్, సెక్రటరీ డాక్టర్ బొర్రా రాంప్రసాద్‌లు మాట్లాడుతూ... పట్టణంతోపాటు కారంపూడి, మాచవరం, దాచేపల్లి, గురజాల ప్రాంతాల వైద్యులు కూడా సహకరించారని తెలిపారు. హత్యాచారానికి గురైన వైద్యురాలి కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ సభ్యులు ఉన్నారు.

మాచవరం: మావచరం ప్రభుత్వ వైద్యశాలలో వైద్యులు, సిబ్బంది శనివారం నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరై నిరసన తెలిపారు. కోల్‌కత్తాలో జరిగిన ఘటన అమానుషమని, దోషులను వెంటనే శిక్షించాలని కోరారు.



మాచవరంలో నల్లబ్యాడ్జీలతో ..



గురజాలలో...



దాచేపల్లి పీహెచ్‌సీ వద్ద..

పేద విద్యార్థులకు ఆర్థిక సాయం

సత్తెనపల్లి: పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించటం అభినందనీయమని సీనియర్ న్యాయవాది దస్తగిరిరావు అన్నారు. పట్టణంలోని ఎస్వీఆర్ డిగ్రీ కళాశాలలో చిట్టా ఈశ్వర్‌సాయి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పలు కళాశాలలకు చెందిన 20 మంది పేద విద్యార్థులకు శనివారం ఆర్థిక సాయం అందించారు. పలు కళాశాలలకు చెందిన 20 మందికి రూ.5 వేల చొప్పున ట్రస్ట్ నిర్వాహకులు చిట్టా విజయభాస్కరరెడ్డి అందించారు. వేద కళాశాల అకాడమిక్ డైరెక్టర్ చింతాడ సూర్యప్రకాష్, ప్రగతి కళాశాల ఇన్‌చార్జి రావిపాటివాసు,కృష్ణారెడ్డి, వీరవల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వీఆర్ఏల సమస్యలను పరిష్కరించాలి



సత్తెనపల్లి: వీఆర్ఏల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఉద్యోగుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. తమ డిమాండ్లను పరిష్కరించనందుకు సత్తెనపల్లి ఆర్డీవో కార్యాలయం ఎదుట డివిజన్ గ్రామ రెవెన్యూ సహాయకులు శనివారం నిరసన ప్రదర్శన చేపట్టారు. పల్నాడు జిల్లా వీఆర్ఏల సంఘం అధ్యక్షుడు షేక్ బందగీ సాహెబ్ మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలో 16 అటెండర్, 6 నైట్ వాచ్‌మెన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఏళ్లుగా భర్తీ చేయడం లేదన్నారు. వీఆర్ఏలతో అక్రమంగా ఈ డ్యూటీలు చేయిస్తున్నారని వాపోయారు. రూల్స్ ప్రకారం ఈ డ్యూటీలు తమతో చేయించరాదన్నా రు. పేస్కేలును తెలంగాణ తరహాలో అమలు చేయాలని, ఖాళీగా ఉన్న పోస్టులను సీనియార్టీ ఆధారంగా వీఆర్ఏలతో భర్తీ చేయాలని కోరారు. సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీవోకు అందించారు. కార్యక్రమంలో సత్తెనపల్లి డివిజన్ అధ్యక్షులు సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.